ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
3★★
సోమవారం 6 మే 2024

ప్రభుత్వ ఆస్పత్రిలో ఆటో డ్రైవర్ మృతి
బంధువుల ఆందోళన 5లో..

రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం 6లో..



గులాబీ దళంలో కేసీఆర్ జోష్

- జనసంద్రంగా పాత బస్టాండ్ చౌరస్తా
- యావర్ రోడ్డు పొడవునా భారీ ర్యాలీ
- జగిత్యాల రోడ్ షోలో కేసీఆర్‌కు నీరాజనం

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్ జగిత్యాలలో నిర్వహించిన రోడ్ షో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో పట్టణంలోని యావర్ రోడ్డు జనసంద్రంగా మారింది. మాజీ సీఎం కేసీఆర్ సాయంత్రం వరకు కరీంనగర్ జిల్లా వీణవంక నుంచి బస్సులో జగిత్యాలకు చేరుకున్నారు. స్థానిక కొత్త బస్టాండు వద్ద డప్పు వాయిద్యాలతో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. బస్సుపై నుంచే కేసీఆర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రసంగాన్ని ప్రారంభించగానే కార్యకర్తలు 'సీఎం..సీఎం' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేసీఆర్ ప్రసంగానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున నినాదాలు వస్తుండడంతో.. ప్రజలు నిశ్శబ్దంగా ఉండాలంటూ పలువురు కోరారు.

ప్రజల నుంచి సమాధానాలు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి జరిగిన అభివృద్ధి శూన్యమంటూ మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు వివరించే ప్ర యత్నం చేశారు. కాంగ్రెస్ సర్కారు హయాంలో రైతులకు రూ. రెండు ల క్షల రుణ మాఫీ అయిందా..రైతు బంధు వచ్చిందా...అంటూ ప్రజలచే స మాధానం రాబట్టడానికి ప్రయత్నించారు. కల్యాణ లక్ష్మీ తులం బంగా రం వస్తుందా... కరెంటు పోతుందా...కరెంటు కోతలు మొదలయ్యా యా అంటూ ప్రజలను అడిగారు. దీంతో అవేమీ వస్తలేవంటూ చేతులను అ డ్డంగా ఊపుతూ పలువురు సమాధానం ఇచ్చారు. అందరికి వస్తున్నాయ ని, కేవలం జగిత్యాల ప్రజలకు వస్తలేవా అంటూ చమత్కరించారు.

జగిత్యాల జిల్లాను రద్దు చేస్తారంటా...

గత ప్రభుత్వ హయాంలో ప్రజల సౌకర్యార్థం కోసం కొత్తగా జగిత్యాల జిల్లాను ఏర్పాటు చేసుకుంటే, సీఎం రేవంత్ రెడ్డి జిల్లాను రద్దు చేస్తామని అంటున్నాడని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. జగిత్యాల జిల్లా ఉం డాల్నా...పోవాల్నా...అని ప్రజలను అడగగా, ఉండాలని ప్రజలు అనడంతో, ఇది జగిత్యాల జిల్లా ప్రజల మాటనా అంటూ..జగిత్యాల జిల్లా ఉండా లంటూ బాజిరెడ్డి గోవర్ధన్‌ను, పెద్దపల్లిలో కొప్పుల ఈశ్వర్, కరీంనగర్‌లో బోయినిపల్లి వినోద్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు. జిల్లా ఉండాలను కునేవారు బీఆర్ఎస్‌ను గెలిపించాలని,వద్దనుకుంటే ఓడగొట్టాలని అన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విమర్శనాస్త్రాలు...

ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ పార్టీలయిన కాంగ్రెస్, బీజేపీ లను లక్ష్యంగా చేసుకొని జగిత్యాల కార్నర్ మీటింగ్‌లో మాజీ సీఎం కేసీ ఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. తన ప్రసంగంలో రైతులు, వ్యవసా యం, సాగు నీరు సమస్యలను ప్రస్తావించడంతో పాటు ప్రజలను ఆక ట్టుకునేలా ప్రయత్నించారు. రూ. రెండు లక్షల రుణ మాఫీ, రైతు బంధు, వరికి రూ. 500 బోనస్, విద్యుత్, తాగునీరు, సాగు నీరు తదితర సమ స్యలను ఎత్తి చూపేలా ప్రసంగించారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో తాము చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించే ప్రయత్నం చేశారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే కాంగ్రెస్ సర్కారుపై ఒత్తిడి తీసుకవచ్చి ఎన్నిక ల్లో ఇచ్చిన హామీలను అమలు చేయించేలా ప్రయత్నిస్తామని భరోసా నింపారు.



ప్రసంగిస్తున్న కేసీఆర్

కేసీఆర్ బస్సుయాత్రకు ఘన స్వాగతం..

జగిత్యాల టౌన్: జగిత్యాలలో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించిన బస్సు యాత్రకు ఘన స్వాగతం లభించింది. కొత్త బస్టాండు వద్ద కేసీఆర్‌కు నిజామాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పలు చౌరస్తాల వద్ద మహిళలు హారతులు పట్టి, తిలకం దిద్ది స్వాగతం పలికారు.

భారీ బందోబస్తు...

కేసీఆర్ పర్యటన సందర్భంగా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ట్రైనీ ఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రఘు చందర్ ఆధ్వర్యంలో పో లీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కేసీఆర్ రోడ్ షో, కార్నర్ మీ టింగ్ జరిగే ప్రాంతాల వద్ద పోలీసులు మోహరించారు. ట్రాఫిక్‌కు ఎ లాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని కొత్త బస్టాండు చౌరస్తా, అంగడి బజార్ చౌరస్తా, తహసీల్ చౌరస్తా, పాత బస్టాండు చౌరస్తాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిం చారు. నటరాజ్ టాకీస్ చౌరస్తా, అన్నపూర్ణ థియేటర్ చౌరస్తాల వద్ద బారీకేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను దారిమళ్లించారు.

కేసీఆర్ పర్యటన కొనసాగిందిలా...

జగిత్యాల టౌన్ :

- జగిత్యాల జిల్లా కేంద్రానికి కేసీఆర్ రాత్రి 7.50 గంటలకు వచ్చారు.
- 8.05 గంటల వరకు కొత్త బస్టాండు చౌరస్తా నుంచి యావర్ రోడ్డులో గల అంగడి బజార్ చౌరస్తా, తహసీల్ చౌరస్తా మీదుగా పాత బస్టాండు చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించారు.
- 8.35 నిమిషాలకు కేసీఆర్ పాత బస్టాండు కార్నర్‌కు చేరుకొని తన ప్రసంగాన్ని ప్రారంభించారు.
- సుమారు 45 నిమిషాల పాటు రోడ్ షో కొనసాగింది.
- రాత్రి 8.36 నిమిషాలకు కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.
- రాత్రి 8.58 గంటలకు ఎమ్మెల్సీ రమణ నివాసంలో ఏర్పాటు చేసిన రాత్రి బసకు కేసీఆర్ వెళ్లారు.
- సుమారు అయిదు నిమిషాల పాటు ఉర్దూలో ప్రసంగించి ముస్లిం మైనార్టీలను ఆకర్శించే ప్రయత్నం చేశారు.

ఎమ్మెల్సీ రమణ నివాసంలో కేసీఆర్ బస...

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ నివాసంలో మాజీ సీఎం కేసీఆర్ రాత్రి బస చేశారు. పలువురు బీఆర్ఎస్ నేతలు, పార్టీ ప్రజాప్రతినిధులతో ముచ్చటించారు. స్థానిక సమస్యలపై ఆరా తీయడంతో పాటు రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై కార్యకర్తలు, నేతలకు దిశా నిర్దేశం చేశారు. ప్రచార తీరు తెన్నులపై సమీక్షించారు. బూత్ స్థాయి వరకు ప్రచారంతో పాటు గెలుపు వ్యూహాలపై శ్రేణులకు పలు సలహాలు, సూచనలు, ఆదే శాలు జారీ చేశారు. కేసీఆర్ నేరుగా కలిసి చేస్తున్న సూచనలతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలి

నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు, నాయకులతో జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, మే 5 : కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి కోరారు. జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 7, 10, 17, 21, 33, 36 వార్డుల కౌన్సిలర్లు వల్లెపు రేణుక, సిరికొండ భారతి, సిరికొండ పద్మ, అల్లె గంగాసాగర్, బండారి రజని, దాసరి లావణ్యలు ఆదివారం ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు వల్లెపు మొగిలి, ధరూర్ క్యాంపు రామాలయ మాజీ చైర్మన్ బ్రహ్మండభేరి నరేశ్, నాయకులు వొంటిపులి రాము మరో 25 మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్సీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం పూర్తిగా అప్పుల కుప్పగా మారిందన్నారు. బడా వ్యాపారులకు కొమ్ముకాస్తు సామాన్యులను పట్టించుకోని బీజేపీకి ఎంపీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు నాగభూషణం, మోహన్, రాజేందర్, దుర్గయ్య ఉన్నారు.

అసెంబ్లీ ఫలితాలే పునరావృతం అవుతాయి

- మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అనీల్

జగిత్యాల టౌన్, మే 5 : అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల తరహాలోనే దేశంలో పునరావృతం అయి ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనీల్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. దేశంలో రిజర్వేషన్లు ఉండకూడదనేదే బీజేపీ సిద్ధాంతమని ఆరోపించారు. జీవన్‌రెడ్డి అత్యధిక మెజార్టీలో గెలిపించి పద్మశాలీల సత్తాచాటాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి మాట్లాడుతూ పద్మశాలీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు గిరి నాగభూషణం, విజయలక్ష్మి, పట్టణ అధ్య క్షుడు కొత్త మోహన్, కౌన్సిలర్లు గంగాసాగర్, రమేష్, లావణ్య, జయశ్రీ, నా యకులు నందయ్య, వినోద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరుగ్యారెంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

కోరుట్ల రూరల్, మే 5 : ఆరు గ్యారెంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని నిజామాబాదు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఆదివారం మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా చాయ్ పే చర్చ కార్యక్రమంలో బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ బడా వ్యాపారులకు మద్దతు పలుకుతూ వారికి వత్తాసు పలుకుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేర్చడంలో విఫలం అయిందని అన్నారు. ఆరు గ్యారెంటీలు అంటూ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. తప్పుడు హామీలు నమ్మి ప్రజలు మళ్లీ మోసపోవద్దని బాజిరెడ్డి సూచించారు. నిజామాబాదు ఎంపీగా తనును గెలిపిస్తే ఈ ప్రాతం అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్, మల్లేష్ యాదవత్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



స్థానికులతో టీ తాగుతున్న బాజిరెడ్డి

ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారోత్సవం

రాయికల్, మే 5: పట్టణంలోని వాసవి గార్డెన్‌లో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షుడిగా కూరగాయల రవి, ప్రధాన కార్యదర్శిగా గరిపెల్లి శ్రీనివాస్, కోశాధికారిగా పల్లెర్ల పవన్ కుమార్, కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం

జగిత్యాల టౌన్, మే 5 : జిల్లా కేంద్రంలోని పావని కంటి ఆసుపత్రిలో ఆదివారం నేత్ర వైద్యుడు, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. 15 మంది నిరుపేదలకు శస్త్ర చికిత్సలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు విజయ్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను చూసి ఆశీర్వదించండి

బీఆర్ఎస్ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి, మే 5 : 15ఏళ్లుగా ఎమ్మెల్యేగా, ప్రభుత్వ చీఫ్ విప్‌గా, మంత్రిగా చేసిన అభివృద్ధి చేపట్టిన సంక్షేమ పథకా లను చూసి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించాలని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్, బతికెపల్లి గ్రామాలలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఇంటింటా తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతాంగ సంక్షేమానికి పెద్ద పీట వేశామన్నారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి ఎన్నికల కోడ్ అంటూ కాలయాపన చేస్తున్న కాంగ్రెస్‌ను నమ్మి మరోమారు మోసపోవద్దంటూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంపీపీ గోళి శోభానురెందర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు రమణారావు, వేణు గోపాల్, నాయకులు గంగాధర్ గౌడ్, లోక మల్లారెడ్డి, బండి వెంకన్న, రాజశేఖర్ గౌడ్, రాజేశ్వర్ రావు, కరుణాకర్ రావు ఉన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోవాలని కోరుతున్న క్రీడాకారులు



కిష్టంపేటలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం



ఉప్పుమడుగులో చదును చేయని క్రీడా ప్రాంగణంలో గేదెలు

రాయికల్, మే 5: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకుగాను క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రాయికల్ మండలంలో 32 గ్రామాలు ఉండగా, 29 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. అయోధ్య, రాజనగర్, వీరాపూర్ గ్రామాల్లో సరైన స్థలం లేక ఏర్పాటు చేయలేదు. 29 గ్రామాల్లో ఒక్కో క్రీడా ప్రాంగణం కోసం రూ.1.50 లక్షల్లోపు నిధులు మంజూరు చేశారు. వాలీబాల్, ఖోఖో, జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. ఈ క్రీడా ప్రాంగణాలు చాలా గ్రామాల్లో గుట్టలు, ఎత్తుపల్లాల్లో ఏర్పాటు చేసి నామ మాత్రంగా బోర్డులు పెట్టి వదిలేశారు. కొన్ని గ్రామాల్లో తూతూ మంత్రంగా ఏర్పాటు చేసి బిల్లులు తీసుకున్నారు. క్రీడా ప్రాంగణాలకు కేటాయించాల్సిన వాలీబాల్, క్రికెట్, వ్యాయామ పరికరాలు గ్రామ పంచాయతీలో ఉంచారు. ప్రస్తుతం క్రీడా ప్రాంగణాలు అసాంఘీక కార్యకలా పాలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువ చ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ప్రజ్ఞ వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, మే 5: జెట్-వికాసతరంగిణి -108, వావిలాలపల్లి శాఖ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వేసవి శిక్షణా శిబిరాన్ని ఆదివారం జ్యోతీనగర్‌లోని ఆండాళ్‌గోష్ఠిలో శాఖ చీఫ్ కో ఆర్డినేటర్ అరుణా భూపతిరావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నైతిక విలువలను పెంపొందించే ఈ శిక్షణను వినియోగించుకోవాలని, నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెడుతూ అభివృద్ధి పథంలో పయనించాలని అన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలు శిక్షణకు అర్హులని, శిక్షణలో శ్లోకాలు, కీర్తనలు, భజనలు, నైతిక కథలు, యోగ, ధ్యానం, పండు గల విశిష్ఠత, రామాయణ, భారత, భాగవతాల్లోని అంశాలు, ఋషుల చరిత్ర లు, ఆటలు నేర్పుతారని పేర్కొన్నారు. బాల బాలికలు పేర్లను ఆండాళ్‌గోష్ఠిలో నమోదు చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు కుటుంబసభ్యుడిలా అండగా ఉంటా

- రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

ధర్మపురి, మే 5: దివ్యాంగులకు కుటుంబసభ్యుడిలా ఎల్లవేళలా అండగా ఉంటానని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ధర్మపురి పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు, వితంతువులకు, వృద్ధులకు, గీత కార్మికులకు మొదట పెన్షన్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే అని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం హోం హాస్టల్‌లో, విద్యలో, ఉద్యోగంలో రిజర్వేషన్ ఇచ్చింది కాంగ్రెస్ అని ఆయన అన్నారు. కేసీఆర్ ఏనాడు సీఎం హోదాలో ప్రపంచ వికలాంగుల దినోత్సవానికి హాజరు కాలేదని ఆయన తెలిపారు. వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల నిరుద్యోగ దివ్యాలాంగులు బొమ్మకంటి మహేందర్, రాగుల రామ్మోహన్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖను ఎత్తివేసి స్త్రీ శిశు సంక్షేమ శాఖలో విలీనం చేసిన చరిత్ర కేసీఆర్‌దేనని ఆయన అన్నారు. కేసీఆర్, బీజేపీ దివ్యాంగుల ద్రోహులని ఆయన తెలిపారు. పెరిక కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం గొప్ప నిర్ణయమని, అందుకే పెరికల కులస్థుల మద్దతు కాంగ్రెస్‌కు ఉంటుందని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా పెరిక కుల నాయకులు అంకతి గంగాధర్, రాందేని మొగిలి, ముద్దసాని అజయ్, అక్కల లింగన్న, గోల్ల శ్రీకాంత్, రఘు, అనిల్, శరత్, శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి, యువతను విస్మరించిన బీజేపీని ఓడించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, మే 5: విద్యార్థి, యువతను విస్మరించిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల ఆఫీస్ బేరర్ల సమావేశం లో నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడు తూ విద్యార్థులను బీజేపీ మతం పేరిట రెచ్చగొట్టడం తప్ప సంక్షేమానికి చేసిందేమీ లేదన్నారు. విద్యార్థి యువత పార్లమెంట్ ఎన్నికల్లో మార్పునకు సిద్ధం కావాలని ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మచ్చ రమేష్, జేరిపోతుల జనార్ధన్, సంగెం మధు, అక్రమ్ ప్రీతం, రంజిత్, మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, సాయి అజాద్ పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

చందుర్తి, మే 5: చందుర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు హాజరై తిరిగి ఇంటికి వెళుతున్న మహిళలను కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని ఎనగల్ గ్రామానికి చెందిన బుర్ర లచ్చవ్వ మల్యాలశివారులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు ఆదివారం హాజరైంది. సభ ముగియడంతో రోడ్డుపైకి వచ్చింది. చందుర్తి వైపు వెళుతున్న కారు లచ్చవ్వను ఢీకొట్టడంతో కాలు విరిగింది. వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడినుండి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

మద్యం పట్టివేత

వీణవంక, మే 5: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో పంజాల కుమారస్వామి అనే వ్యక్తి అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. కుమారస్వామి మద్యం విక్రయిస్తున్నాడని పక్కా సమాచారంతో తనిఖీ చేయగా సుమారు 16,120 రూపాయలు విలువ చేసే మద్యం పట్టుబడిందని పోలీసులు తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని కుమారస్వామిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ



ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు

వేములవాడ రూరల్, మే 5: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వాహనాన్ని ఎన్నికల అధికారులు తనిఖీ చేసారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం వివిధ మండలాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని వేములవాడకు తిరిగి వస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వాహనాన్ని మర్రిపల్లి వద్ద ఎన్నికల అధికారులు తనిఖీ చేసారు. తనిఖీలు నిర్వహించడానికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులకు పూర్తిగా సహకరించారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి తైక్వాండో క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 5: రాష్ట్ర, జాతీయ స్థాయి, అంతర యూనివర్సిటీ తైక్వాండో పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులను ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్‌లో కరీంనగర్ జిల్లా యాదవ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారి శోభరాణి, వివేకానంద పాఠశాలల చైర్మన్ సొగాని కొమురయ్య, యాదవ ట్రస్టు అధ్యక్షుడు బబ్బురి కుమార్, బూస అంజయ్య పాల్గొని క్రీడాకారులు బబ్బురి అక్షిత, ప్రవళిక, ఎండి ఆస్మిన్, ఆఫియ, సుప్రియ, మహేశ్‌బాపు, హరి, హరిష్, తిరుమల్ కుమార్, రవీందర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, ఉండాటి సిద్దులను శాలువా, మెమెంటోతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని తైక్వాండో క్రీడాకారులు జాతీయ, ఒలింపిక్ స్థాయి క్రీడల వరకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటేందుకు తైక్వాండో క్రీడాకారులకు మంచి శిక్షణ అందించాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి బండి మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు దుండ్ర రాజయ్య, టౌన్ అధ్యక్షుడు గాలి రవి, కర్ణాటకపు రాజయ్య, జంగ కొముకయ్య, మార్క వెంకటేశ్, బట్టి శంకర్ పాల్గొన్నారు.

సీఎస్ఐటీపీ ఎస్ఆర్‌బీవీపీ ఎన్నికలు

- ఉపాధ్యక్షుడిగా జి కృపాదానం ఎన్నిక



సీఎస్ఐటీపీ ఎస్ఆర్‌బీవీపీ ప్రతినిధులతో కృపాదానం

కరీంనగర్ కల్చరల్, మే 5: సీఎస్ఐటీపీ సౌత్ రీజియన్ బెన్ఫిషరీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన గుండ్ర కృపాదానం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగుళూరులో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్టు అసోసియేషన్ బెన్ఫిషరీ వెల్ఫేర్ అసోసియేషన్ సౌత్ రీజియన్ బాడీ ఎన్నికలు ఆదివారం జరుగగా అధ్యక్షుడిగా టీసీ రవిచంద్రన్ (తమిళనాడు), ఉపాధ్యక్షుడిగా జి.కృపాదానం (తెలంగాణ), తెలంగాణ రీజియన్ ప్రధాన కార్యదర్శిగా జయపాల్ జయకుమార్ (తమిళనాడు), రాష్ట్ర ఉపకార్యదర్శిగా స్టాలిన్ (కర్ణాటక), కోశాధికారిగా ఏబెల్ (కర్ణాటక) ఎన్నిక కాగా తెలంగాణ రాష్ట్ర బాధ్యులుగా కొత్త విద్యాసాగర్ (హైదరాబాద్), అనిల్‌రాజ్ (మంచిర్యాల), జయపాల్ (వరంగల్) వి జాన్సన్ (కరీంనగర్) ఎన్నికయ్యారు. వీరంతా మూడు సంవత్సరాల పాటు పదవిలో ఉంటారు.

నేడు కరీంనగర్‌కు సీపీఐ జాతీయ కార్యదర్శి రాక

భగత్‌నగర్, మే 5: సోమవారం కరీంనగర్‌కు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి రానున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని పద్మనాయక కళ్యాణ మండపంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల సీపీఐ గ్రామశాఖ, మండల కార్యదర్శిల, జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యుల ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా ఉన్నందున కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల గెలుపు కోసం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ శ్రేణులు సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మానవత్వం చాటుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్



రోడ్డుపై గాయాలతో పడి ఉన్న వ్యక్తి

కరీంనగర్ క్రైం, మే 5: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. హుజురాబాద్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని పూర్తి చేసుకొని కరీంనగర్ వెళ్తున్నారు. మార్గమధ్యంలో మానకొండూర్ మండలం సదాశివపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అపస్మారక స్థితిలో ఓ వ్యక్తి పడి ఉన్నాడు. వెంటనే పొన్నం ప్రభాకర్ తన కాన్వాయ్‌ను నిలిపివేసి గాయపడ్డ వ్యక్తి పరిస్థితిని సిబ్బందితో కలిసి పరిశీలించారు. అంబులెన్స్ వచ్చేలోపు తన వాహనంలో గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం గాయపడ్డ వ్యక్తి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన తరువాత మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అటుగా వెళ్తున్న ప్రయాణికులు కొనియాడారు.



గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న మంత్రి పొన్నం

వెలగని ఎల్‌ఈడీ లైట్లు

- పట్టించుకోని కాంట్రాక్టర్...అధికారులు



జగిత్యాలలో వెలగని లైట్లు

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారి మ ధ్యన సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైటింగ్ స్ట్రిప్స్ వెల గకుండా పోయాయి. కాసులకు కక్కుర్తి పడిన కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా నాణ్యత లోపంతో వాటర్ ప్రూఫ్ ఎల్‌ఈడీ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత యేడాది జూన్ మాసంలో పట్టణ ప్రగతి నిధు లతో సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఎల్‌ఈడీ లైట్ స్ట్రిప్స్‌ను ఏర్పాటు చేశారు. సు మారు రూ. 16.90 లక్షలతో పట్టణ శివారులోని దరూర్ గ్రామ శివారు నుంచి కొత్త బస్టాండు చౌరస్తా మీదుగా మంచినీళ్ల బావి వరకు రహదారి మధ్యన సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఎల్‌ఈడీ లైటింగ్ స్ట్రిప్స్‌ను ఏర్పరిచారు. ఒక్కో స్తంభా నికి కనీసం సుమారు 50 మీటర్ల పొడవుతో వాటర్ ప్రూఫ్ లైటింగ్ అమరిచారు. సంవత్సర కాలం పాటు వీటి పనితీరును చూడాల్సిన బాధ్యత సంబంధిత కాం ట్రాక్టరుకు అధికారులు అప్పగించారు. నాణ్యత లోపంతో ఏర్పాటు చేయడం కార ణంగా కొన్ని రోజులుగా స్ట్రిప్స్ పనిచేయడం లేదు. కాంట్రాక్టర్‌ను అధికారులు ప్ర శ్నించకపోవడం, పాలకవర్గంలో చోటుచేసుకున్న మార్పులు కారణంగా స్ట్రిప్స్ పు నరుద్ధరణ జరగడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారు లు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని లైటింగ్ స్ట్రిప్స్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఆటో డ్రైవర్ మృతి

- వైద్యుడు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన
- ఆస్పత్రి సామగ్రి ధ్వంసం.. వైద్యుడిపై దాడి
- కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తం



ఆటోను అడుకుంటున్న ఆందోళనకారులు(ఇన్‌సెట్‌లో మృతి చెందిన రహిమాన్)

కోరుట్ల, మే 5 : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరిన ఓ ఆటో డ్రైవర్ ఆదివారం మృతి చెందడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. ఆస్పత్రి సిబ్బంది, వైద్యుడి నిర్లక్ష్యంతోనే మృతి చెందాడంటూ మృతుడి బంధువులు ఆందోళన చేపట్టారు. ఆగ్రహంతో ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి వైద్యుడిపై దాడి చేయడంతో ఆస్పత్రి వద్ద ఉ ద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం చేరు కుని అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికి వారిపై దురుసుగా ప్రవ ర్తించడంతో పరిస్థితి అదుపు తప్పింది. బంధువులు తెలిపిన వివ రాల ప్రకారం పట్టణంలోని హాజీ పుర ప్రాంతానికి చెందిన నజిబుల్ రహిమాన్ అలియాస్ ఆటో ముజీబ్ (49) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కొత్త బస్టాండ్ ఆటో స్టాం డ్ వద్ద ఉన్నట్టుండి సోమసిల్లి పడిపోయాడు. గమనించిన ఆటో యూనియన్ సభ్యు లు రహిమాన్‌ను పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బంధువులు సమాచా రం అందించారు. ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది రహిమాన్‌కు ప్రథమ చికిత్స చేసి వి ధుల్లో ఉన్న వైద్యుడికి సమాచారం అందించారు. చాలా సమయం తరువాత ఆస్ప త్రికి చేరుకున్న వైద్యుడు రహిమాన్‌ను చికిత్స చేసేందుకు ప్రయత్నించేలోపే రహి మాన్ అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. రహిమాన్ మృతి విషయం తెలు సుకున్న బంధువులు, మిత్రులు వైద్యుడితో పాటు సిబ్బందిని నిలదీసారు. ఆగ్రహంతో ఆస్పత్రిలో ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. భయాందోళనకు గురైన డాక్టర్, సిబ్బం ది అక్కడే ఉన్న గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నారు. దీంతో కోపోద్రులైన బంధువులు, తలుపులను బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కథలాపూర్ ఎస్ఐ నవీన్ తన సిబ్బందితో అక్కడి చేరుకుని ఆందోళన కారులను సమాదాయించే ప్రయత్నం చేసినా వారిపై బంధువులు దురుసుగా ప్రవర్తించారు. కోపోద్రులైన రహి మాన్ మిత్రులు తమతో తచ్చుకున్న కిరోసిన్ అనుపత్రిలో చల్లి అంటించే ప్రయత్నం చేసారు. గమనించిన పోలీసులు వారించి అక్కడి నుంచి చెదరగొట్టారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆస్పత్రి వద్దకు పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో మరింత ఉద్రిక్తత నెలకొంది. డ్యూటీలో ఉన్న వైద్యుడు బయటకు రావాలని ఆందోళనా కారులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు వైద్యుడిని పోలీసులు స్టేషన్‌కు ఆటోలో తరలిస్తుండగా ఆటోను అడ్డుకునా వైద్యుడి పై దాడి చేశారు. వెంటనే పోలీ సులు వారించి ఎట్టకేలకు పోలీసు స్టేషన్‌కు తరలించారు. రహిమాన్ మృత దేహంతో బంధువులు ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం పోలీసు ఉన్నతాధికారుల వరకు వెళ్లడంతో మెట్‌పల్లి డీ ఎస్పీ ఉమామహేశ్వర్ రావు కోరుట్ల సీఐ సురేష్ బాబు, మేడిపల్లి, మెట్‌పల్లి ఎస్ఐ శ్యాంరాజు, చిరంజీవి సంఘటన స్థలం వద్దకు చేరుకుని పరిస్థితి సమీక్షించారు. విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. రహిమాన్ ఎండ తీవ్రత్తకు మృతి చెంది ఉంటాడని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉండగా రహిమాన్ భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. పెద్ద కూతురు వివాహం ఈ నెల 17వ తేదీన ఉన్నట్లు బంధువులు తెలిపారు.

విరిగిపడిన వృక్షం

- మూడు వాహనాలు ధ్వంసం



ధ్వంసమైన వాహనం

వేములవాడ, మే 5 : వేములవాడ పట్టణంలోని పార్వతీపురం వసతి గదుల వెనుక భాగంలో గల వీఐపీ రోడ్డులో ఆదివారం నాడు చెట్టు విరిగి పడిన ఘటనలో మూడు వాహనాలు ధ్వంసం అయ్యాయి. నటరాజ విగ్రహం నుండి గుడి చెరువుకు వెళ్లే మార్గంలోని విఐపి రోడ్డులో ఏండ్ల నాటి చింత చెట్టు కింది భాగం మొత్తం పుచ్చిపోయి ఆదివారం నాడు ఒకసారిగా కుప్పకూలి పడిపో యింది. చెట్టు నీడ ఉండడంతో అక్కడ పార్కు చేసి ఉంచిన వాహనాల పై పడడంతో పాక్షికంగా ధ్వంసమయ్యాయి. పోలీస్ శాఖకు చెందిన డాగ్ స్క్వాడ్ సిబ్బంది అదే సమయంలో అక్కడికి చేరుకుని వాహనం నుంచి దిగి ప్రధాని పర్యటన నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, రోడ్డు మధ్యలో ఉన్న పోలీసు వాహనంపై పడడంతో వాహనం ధ్వంసం అయింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉద్యోగం లేదని మనస్తాపం..

యువకుడి ఆత్మహత్య



లవన్‌కుమార్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 5: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన ఆకుల లవన్‌కుమార్(25) ఉద్యోగం లేదనే మనస్తాపంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన లవన్ కుమార్ హైదరాబాద్‌లో ఇటీవల ఎంబీఏ పూర్తి చేశాడు. ఉద్యోగం లేకపోవడంతో ఇంటి వద్ద ఉంటున్నాడు. గత నెల 7న పక్కింటివారి కూలర్ తన ఇంటికి తీసుకొచ్చాడు. కూలర్ ఎందుకు తీసుకొచ్చావంటూ తల్లి మందలించింది. దీంతో అదే రోజు రాత్రి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వెళ్లాడు. ఉద్యోగం లేదని బాధపడుతూ అప్పటి నుంచి తల్లితో ఫోన్ సరిగా మాట్లాడడం లేదు. ఆదివారం ఉదయం బొప్పాపూర్ గ్రామ సమీపంలోని జక్కుల చెరువు వద్ద ద్విచక్ర వాహనం, చెప్పులను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు స్థానికుల సహాయంతో బయటకు తీశారు. చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని కాగా లవన్‌కుమార్ తల్లి తన కొడుకు మృతిపై అనుమానం వ్యక్తం చేసింది. తల్లి వనజ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలేవి

- దాహార్తి తీరక వన్య ప్రాణులు విలవిల



మరిమడ్లలో ఖాళీగా ఉన్న నీటి తొట్టిలు

కోనరావుపేట, మే 5: వన్యప్రాణులను సంరక్షించాలని అధికారులు చెబుతున్నప్పటికీ అటవీ శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వేసవిలో వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవడానికి అటవీ ప్రాంతం నుండి జనవాసంలోకి వచ్చి కుక్కల దాడిలో మృతి చెందుతున్నాయి. అడవి జంతువులను కాపాడడానికి అడవి ప్రాంతంలో నీటి తొట్టిలను అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. కానీ వాటిలో నీటిని నింపకపోవడంతో వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవడం కోసం ఇబ్బందులు పడుతున్నాయి. నీటి తొట్టిలను ఏర్పాటు చేసిన సమయంలో నీళ్లు నింపి మళ్లీ నీళ్లు పోయకపోవడంతో వేసవిలో అడవి జంతువులకు ఇబ్బందులు తప్పడం లేదు. కోనరావుపేట మండలంలోని శివంగాలపల్లి, మరిమడ్ల అటవీ ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు నీటి తొట్టిలను ఏర్పాటు చేశారు. కానీ వాటిలో అధికారులు నీరు నింపడంలో మర్చిపోయారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు నీటి తొట్టిలో నీరు నింపాలని ప్రజలు కోరుతున్నారు.

'సన్'డే

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దంచి కొడుతున్న ఎండలు
- జగిత్యాల జిల్లా వెల్గటూరులో రాష్ట్రంలోనే అత్యధికంగా 47.1 డిగ్రీలు
- పలు చోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలుచోట్ల 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల వరకే ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

జగిత్యాల టౌన్, మే 5: రెండు, మూడు రోజులుగా జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతున్నాయి. జిల్లాలో ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా వెల్గటూర్ మండల కేంద్రంలో 47.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌లో 46.8, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో ఎనిమిది ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వాతవరణ శాఖ వరుసగా రెండో రోజు జిల్లాను రెడ్ అలర్ట్‌గా ప్రకటించింది. అవసరమైతే తప్పా బయటకు వెళ్లవద్దని, అత్యవసర పరిస్థితుల్లో జాగ్రత్తలు పాటించాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లిలో 45.6, వెల్గటూర్ మండలం గుల్లకోట, ధర్మపురి మండలం జైనలో 45.5 డిగ్రీలు, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 45.3, రాయికల్ మండల కేంద్రంలో 45.1, మెట్‌పెల్లి పట్టణంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో రాత్రి 10 దాటిన తర్వాత కూడా ఉక్కపోతలు తప్పకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.



జగిత్యాలలో తలకి రుమాలు కట్టుకుని వెళుతున్న ప్రయాణికులు



గొడుగు పట్టుకుని దోసకాయలు విక్రయిస్తున్న మహిళ



జన సంచారం లేక వెల వెలబోతున్న వీణవంక బస్టాండు ప్రాంతం

- **వీణవంక:** మండలంలో వరుసగా నాలుగో రోజు ఉష్ణోగ్రతలు తగ్గలేదు. ఆదివారం మండలంలో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది. ప్రతి రోజు ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు కావడంతో వీణవంక బస్టాండ్ ప్రాంతం జన సంచారం లేక వెలవెలబోయింది.
- **సిరిసిల్ల:** వడగాలులు, ఎండ తీవ్రతతో ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సెలవు దినం కావడంతో అందరూ ఇళ్లకే పరిమితం అయ్యారు. జన సంచారం లేక జిల్లా కేంద్రంలోని రోడ్లు వెలవెలబోయాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉష్ణోగ్రత 44.7, చందుర్తిలో 44.6, ఇల్లంతకుంటలో 44.3, గంభీరావుపేటలో 44.1, వేములవాడలో 44, వీర్నపల్లిలో 43.9, వేములవాడ రూరల్‌లో 43.9, బోయినపల్లిలో 43.7, తంగళ్లపల్లిలో 43.4, రుద్రంగిలో 43.4, ఎల్లారెడ్డిపేటలో 42.9, కోనరావుపేటలో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

విద్యారంగాన్ని పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధనవంతుల కొమ్ముకాస్తుందన్నారు. అదానీ, అంబానీల అప్పులను మాఫీ చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రం నుంచి లక్షల రూపాయలు టాక్స్‌ల రూపంలో తీసుకున్న కేంద్రం అంతర్జాతీయ ప్రామాణాలతో ఒక్క ఆసుపత్రిని కూడా నిర్మించలేదన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి విస్మరించారన్నారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీల కుల గణన చేయాలని కోరితే బీజేపీ వ్యతిరేకించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వ్యతిరేకమని ఆరోపించారు. అనంతరం ప్రొఫెసర్లు పద్మజ, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మోదీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో కొరివి వేణుగోపాల్, కందుకూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

● విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీ

విద్వేష, విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఓడించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌తో మాట్లాడారు. అనంతరం రైతుబజార్‌లో జాగో తెలంగాణ, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నైనాల గోవర్దన్, రాయిదాస్ రాయ్, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం హన్మేశ్, కొరివి వేణుగోపాల్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి శ్రీకాంత్, డీబీఎఫ్ పులి కల్పన, స్వరూప, సౌజన్య, రాణా ప్రతాప్, అంజి, తిరుపతి, కుమారి, గౌస్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీతో రాజ్యాంగానికి ముప్పు

మానకొండూర్, మే 5: కేంద్రంలో మరోసారి మోదీ సర్కార్ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతుందని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఆకునూరి మురళి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఐదో రోజు ఆదివారం మానకొండూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ కేసీఆర్ పాలనను తెలంగాణ ప్రజలు ఓడించారని అన్నారు. 2014 లో జరిగిన ఎన్నిక సందర్భంగా నరేంద్ర మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారం చేపట్టినా దాని ఊసే లేదని విమర్శించారు. 2018లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఇల్లు లేని నిరుపేదలందరికీ సొంత గృహం ఉండేలా చూస్తామని చెప్పారని తెలిపారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ఆపార్టీ నేతలు బహిరంగంగానే మాట్లాడుతున్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి ఓటు వేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బస్సుయాత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జమ్మికుంట/ఇల్లందకుంట, మే 5: జమ్మికుంట పరిధిలో వేర్వేరు చోట్లు ఆదివారం వడ దెబ్బ తగిలి ముగ్గురు మృతి చెందారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల ఆదర్శనగర్ రైల్వే ట్రాక్ పక్కన ఓ వ్యక్తి ఎండ తీవ్రతతో ఆదివారం మృత్యువాత పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట మండలం చిన్నకోమటిపల్లి గ్రామానికి చెందిన మూడెడ్ల రాజయ్య (50) మతి స్థిమితం కోల్పోయి వారం రోజుల క్రితం ఇంటి నుండి బయ టకు వచ్చాడు. ఊరూరా భిక్షాటన చేస్తూ, కొత్తపల్లిలోని రైల్వే ట్రాక్ పక్కన ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు ఏరుకుంటున్నాడు. కాగా ఆదివారం రైల్వే ట్రాక్ పక్కన మృత్యువాత పడి ఉన్నాడు. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా, ఎండ తీవ్రతతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. కాగా జమ్మి కుంట రైల్వే స్టేషన్‌లోని ఫస్ట్ ప్లాట్ ఫారమ్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. మృతుడి వయస్సు 50- 60సంవత్సరాల మధ్య ఉంటుంది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు, గుర్తింపు కార్డులు లభించలేదు. అనారోగ్యం, వడ దెబ్బతో మృతి చెంది ఉంటాడని రైల్వే పోలీస్ లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని జమ్మికుంట ప్రభు త్వ ఆస్పత్రిలో భద్ర పరిచినట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధర్మారం, మే 5: ధర్మారం మండలం బంజేరుపల్లిలో కల్లోల వెంకయ్య(40) అనే వ్యక్తి శనివారం రాత్రి మద్యం మత్తులో విషగుళిలు మింగగా, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా జలదంకి మండల కేంద్రానికి చెందిన వెంకయ్య 15రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజేరుపల్లి గ్రామంలో భవన నిర్మాణాలకు కూలి పని చేయడానికి వచ్చాడు. శనివారం రాత్రి వెంకయ్య మద్యం తాగిన మత్తులో విష గుళికలు మింగాడు. అతని కరీంనగర్ ఆసుపత్రికి తరలింగా చికిత్స పొందుతూ అదేరాత్రి మృతిచెందాడని మృతుడి భార్య వెంగమ్మ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

వీణవంకలో యువకుడు..

వీణవంక, మే 5: పురుగుల మందు తాగిన మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన పూదరి కుమార్ (38) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. కుమార్ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరుచూ తనకు పెళ్లి కావడం లేదని తెలిసిన వారితో చెప్పుకుంటూ బాధప డేవాడు. మనస్తాపం చెందిన కుమార్ శనివారం పురుగుల మందు తాగాడు. స్థానికులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు మృతి చెందాడు. కుమార్ తల్లి పూదరి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకిరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మే 5: మండలం ముంజంపల్లి శివారులో గల జాలగుట్ట వద్ద ఆదివారం మోటార్ సైకిలిస్టు అదుపు తప్పి పడిపోయిన సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన ఓరుగంటి సురేష్ అనే వ్యక్తి వ్యక్తి గత పనిపై మోటార్ సైకిల్‌పై కరీంనగర్‌కు వెల్లుతున్నాడు. జాలగుట్ట వద్ద అదుపుతప్పిపడిపోవడంతో తీవ్రగాయలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



మనోహర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, మే 5 : కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లి బస్టాండ్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర మండలం చర్లపల్లికి చెందిన దయ్యాల మనోహర్(23) చెందాడని పోలీసులు తెలిపారు. మనోహర్ చొప్పదండి నుంచి గంగాధరకు బైక్‌పై వెళ్తుండగా తీగలగుట్టపల్లి బస్టాండ్ వద్ద ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కారు పక్కన నిలుచున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలు కాగా మనోహర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. మనోహర్‌ను ఆసుపత్రికి తరలించగా ఆదివారం ఉదయం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణ మైన రోడ్డుపై పార్క్ చేసిన కారు యజమానిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు

జమ్మికుంట రూరల్, మే 5: ఇళ్లు, ఖాళీ స్థలం అమ్ముతామని నమ్మబలికి ఓ మహిళ వద్ద డబ్బులు తీసుకోని బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై పోలీస్‌లు ఆదివారం కేసు నమోదు చేశారు. జమ్మికుంటకు చెందిన రావుల తిరుపతి, రావుల రాజేందర్ అనే వ్యక్తులు హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన బెల్లం వసంతకు ఇళ్లు, 30గుంటల ఖాళీ స్థలం అమ్ముతామని చెప్పి పథకం ప్రకారం డబ్బులు వసూళ్లు చేశారు. తీరా రిజిస్ట్రేషన్ సమయం వచ్చే సరికి ఏం చేసుకుంటారో చేసుకో అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిందని, ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన ఒకరిపై కేసు

వీణవంక, మే 5:మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆత్మీయ సమ్మేళనం ముగించుకొని జగిత్యాల సభకు బయలు దేరి వెళ్తుండగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా అనుమతి లేకుండా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఏజెంటు మొలుగు పూర్ణచందర్ టపాకాయిలు కాల్చినందుకు ఎఫ్ఎస్‌టీటీం (ఎన్నికల అధికారి)ఇన్‌చార్జి నగరీతి రాంకూమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పూర్ణచందర్ పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై సూచించారు.

మరమగ్గాల కార్మికులకు యారన్ సబ్సిడీలను అందించాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 5: సిరిసిల్లలో బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అందించాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్ భద్రావతి సొసైటీ వద్ద ఆదివారం సీఐటీయూ పవర్ లూం వర్కర్స్ యూనియన్ వార్డుల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమగ్గాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్ద ఎత్తున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడంలో భాగంగా ఈ నెల 8వ తేదీన సాయంత్రం 4గంటలకు నేహ్రూనగర్‌లోని భవాని ఫంక్షన్‌హాల్‌లో మరమగ్గాల కార్మికుల విస్తృత స్థాయి సమావేశాన్నిఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం జరిగబోయే పార్లమెంట్ ఎన్నికలల్లో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలని కార్మిక చట్టాలు హక్కుల రక్షణ కోసం ఇండియా కూటమిలో భాగస్వామి అయిన కాంగ్రెస్ కూటమికి పవర్‌లూం వర్కర్స్ యూనియన్ పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతోందని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు గుండు రమేష్, సబ్బని చంద్రకాంత్, కంది మల్లేశం, బెజుగం సురేష్, సదానందం, దశరథం, దామోదర్, గణేష్, విజయ్, ప్రసాద్, తిరుపతి, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ ప్రవేశ పరీక్ష

- జిల్లాలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- 3,466 మంది విద్యార్థులు హాజరు



పరీక్ష రాసేందుకు క్యూ లైన్‌లో వెళుతున్న విద్యార్థులు



రూం నంబరు చూసుకుంటున్న విద్యార్థులు

తిమ్మాపూర్, మే 5: దేశవ్యాప్తంగా వైద్య, విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్ ప్రవేశ పరీక్ష) ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నీట్‌పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లోని వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాలలో 828 మంది విద్యార్థులకు గాను 811 మంది హాజరయ్యారు. వివేకనంద డిగ్రీ, పీజీ కాలేజీలో 792 మందికి గానూ 778 మంది, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 480 మందికి గానూ 469 మంది పరీక్ష రాశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ పరీక్ష కేంద్రంలో 720 మందికి 706 మంది, వాగేశ్వరి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రంలో 720 మందికి 702 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 3,540 మంది విద్యార్థులకు గానూ 3,466 మంది పరీక్ష రాశారు. కాగా 74 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని నీట్ అర్హత పరీక్ష సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ టి లలితాకుమారి తెలిపారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.20గంటల వరకు ఒకే షిఫ్టులో పెన్ను పేపర్ విధానంతో నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఒక్క నిమిషం నిబంధన కారణంగా పరీక్షకు ఆరగంట ముందు నుంచే విద్యార్థులను లోనికి అనుమతిం చలేదు. తమ వెంట పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించిన అడ్మిట్ కార్డు, ఏదైనా గుర్తింపు కార్డు ఉంటేనే అభ్యర్థులను లోనికి అనుమ తించారు. ఫొటోలు వెంట తీసుకురాని కొందరికి పరీక్ష కేంద్రాల్లోనే అందజేసే ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డు వెంట తీసుకురాని ఒకరిద్దరిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. మొబైల్‌తో సహా ఇతర ఎలాక్ట్రానిక్ వస్తువులను, షూస్ వంటి వాటిని అధికారులు పరీక్ష కేంద్రాంలోనికి అనుమ తించలేదు. ఏండలు తీవ్రంగా ఉన్నప్పటికీ పరీక్షా కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్ఎంపీ, పీఎంపీ సమస్యలు పరిష్కరిస్తాం

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మే 5: ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మపురి మండల కేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీలతో ఆదివారం ఉదయం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను జడ్పీ చైర్మన్‌గా ఉన్న కాలంలో ఈ భవనానికి రూ 4.60 లక్షలు నిధులు మంజూరు చేసానన్నారు. ప్రజా కుటుం బం నుంచి వచ్చిన పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఎంపీగా ఒక అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో ధర్మపురి మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు మామిడాల రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, జక్కు రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, పాల్గొన్నారు.

'మండలంలోని ప్రతీ సమస్యను పరిష్కరిస్తాం'

బుగ్గారం మే 5: నూతన బుగ్గారం మండలంలోని ఉన్న ప్రతి సమస్యను పరిష్కారిస్తామని విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. యశ్వంతరావుపేట గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పలు పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, మండల యూత్ అధ్యక్షుడు బీరుపూరి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మెట్‌పల్లిలోని ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మెట్‌పల్లి, మే 5: మెట్‌పల్లి పట్టణంలోని శ్రీవాణినికేతన్ హైస్కూల్ 2003-04 బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమేళన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో ముందుగా ఉపాధ్యాయులు వేడుకను ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు అంతా ఒక్కచోట చేరడం పండగలా ఉందన్నారు. జీవితంలో మంచి స్థానంలో విద్యార్థులు స్థిరపడడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చదువులు నేర్పిన గురువులను శాలువలతో సన్మానించి ఆశీర్వదనాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సింహాద్రి, అంజయ్య, రాజేశ్వ ర్, శోభరాణి, నాగేశ్వర్, సమ్మేళన నిర్వాహకులు ఆకుల ప్రవీణ్, పులిమామాడి ప్రవీణ్, తోట సంతోష్, సంగు ప్రతాప్, నిరోషా, పద్మ, జ్యోతి, లావణ్య, అజిజ్‌ఖాన్, జీవన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి

పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మక్కాన్‌సింగ్, వంశీ, కాంగ్రెస్ శ్రేణులు

గోదావరిఖని/పాలకుర్తి మే 5: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఆదివారం గోదావరిఖని చౌరస్తా నుంచి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పాలకుర్తి మండలం జయ్యారం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్ల సింగరేణిలో ట్రాన్స్‌ఫర్ కావాలన్నా, డిపెండెంట్ ఉద్యోగాలు కావాలన్నా లంచాలు తీసుకునేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పారదర్శకంగా డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతుందని, సింగరేణిలో ఇక నుంచి అవినీతికి తావులేదన్నారు. సింగరేణి కార్మికులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న ఇన్‌కంటాక్స్ రద్దును కూడా చేయనున్నట్టు తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేతి గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మేయర్ బంగి అనిల్ కుమార్, కాంగ్రెస్ కార్పొరేటర్ మహంకాళి స్వామి, పాలకుర్తి మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, పుట్నూర్ ఎంపీటీసీ గంగాధరి రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి టి జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టి జీవన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, మే 5: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఎమ్మెల్సీ, నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి టి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో పాటు జీవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రైతులను మొదటి నుంచి ఆదుకుంటున్న పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ మాత్రమేనన్నారు. ఆగస్టులోపు రూ. 2లక్షలు రుణమాఫీ, రైతుకు రూ. 500ల బోనస్‌ను వచ్చే సంవత్సరం ఇస్తుందన్నారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వలన పేదవారికి ఉపాధి, విద్యార్థుల విద్యకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు తీసుకొస్తానని చెప్పి ప్రకటనలకు వరకు ఉందన విషయం రైతులు గమనించాలని, ఇచ్చిన హామీలను నేరవెర్చే కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలబడాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన అన్ని హామీ లను నేరవేస్తుందని, లోక్‌సభ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీని అందించాలని కోరారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ అయోధ్యను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తుందని మండి పడ్డారు. అయోధ్యలో రాముడి ప్రతిష్ట కాకముందే అక్షింతలు ఎలా పంచుతారని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే ఇంటింటికీ అక్షింతలు పంచిందని, రాజకీయాల కోసం హిందూ దేవుళ్లను వాడుకోనే బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కొమిరెడ్డి కరంచందు, కొమిరెడ్డి విజయ్‌ఆజాద్, పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, కొమిరెడ్డి తిరుపతి, తిరుపతి, జెట్టి లక్ష్మణ్, షాకీర్, పురుషోత్తం, గంగారెడ్డి, మున్నూర్‌కాపు సంఘాల పాల్గొన్నారు.

● అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

మల్లాపూర్: రాష్ట్రంలో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు, సుజిత్‌రావు, జలపతిరెడ్డి, పుండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● జీవన్‌రెడ్డిని గెలిపించాలి..

మెట్‌పల్లి రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో చేయి గుర్తుకు ఓటు వేసి నిజామాబాద్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని చౌలమద్ది గ్రామంలో నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని యాదవ సంఘం, పద్మశాలి సంఘాలు కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, గడ్డం లింగారెడ్డి, రాజేందర్, కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గెలుపు కోసం మెట్‌పల్లి పట్టణంలో నాయకులు ప్రచారం చేపట్టారు. ఆదివారం పట్టణంలోని గౌడ కులస్తులతో కలిసి కాంగ్రెస్‌కు మద్దతు తెలిపి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూదారి నర్సాగౌడ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

రాయికల్, మే 5: మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండలంలోని ఇటిక్యాల గ్రామ మాజీ వార్డు మెంబర్లు, బీఆర్ఎస్ ఇటిక్యాల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేల్పుల లక్ష్మణ్, బొమ్మన ముత్తన్న, ఎండీ షఫీ, పుల్లూరి రాజేష్, స్వామి, నరేష్, ఆసిఫ్, రాయను, సోహిల్, ఆసిఫ్, సమీర్, మేర కుల సంఘం సభ్యులు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

●రాయికల్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ యూత్ ఉపాధ్యక్షుడు కాశిరెడ్డి సంజీవ్, బీఆర్ఎస్ నాయకులు సుంకె శంకర్‌తో పాటు 10 మంది యువకులు నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షుడు బత్తిని నాగరాజు, దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

తండ్రి కోసం తనయ ప్రచారం

పెగడపల్లి, మే 5 : పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం ఆయన తనయ నందిని ఆదివారం పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా, చీఫ్ విప్‌గా, మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి కొప్పుల ఈశ్వర్ చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించాలని ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు రంగు గంగా ధర్ గౌడ్, రాజశేఖర్ గౌడ్, రాజేశ్వర్ రావు, విజయ్ యాదవ్, అర్చన, పద్మ తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్ సేవలు మరవలేనివి

- బీజేపీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్

మెట్‌పల్లి, మే 5: బీజేపీ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన బాజోజి భాస్కర్ సేవలు మరవలేనివని పార్టీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్ అన్నారు. ఆదివారం భాస్కర్ మూడో వర్ధంతి కార్యక్రమాన్ని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కోరుట్ల అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ జనతా పార్టీ కార్యకర్తగా ఎన్నో సేవలు అందించరన్నారు. పార్టీకి అండగా ఉండి అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు.

కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధోనికేల నవీన్, జిల్లా ఉపాధ్యక్షుడు సుంకేట విజయ్, అనిల్, రమేష్‌యాదవ్, సత్యానారాయణ, అశోక్, రాజయ్య, రాజారెడ్డి, రమేష్, అనిల్‌కుమార్, సౌజన్య, సునీత, రజిని, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

మల్యాల, మే 5: ఇటీవల వెలువడిన ఇంటర్, పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన మండలంలోని ముత్యంపేటకు చెందిన పలువురు విద్యార్థులను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. పద్మశాలి విద్యార్థులు బాలే కృష్ణశ్రీ, పన్నాటి వర్షిణి, కట్కూరి గాయత్రి, మ్యాన పావని, అంకం అమూల్యను అభినందించి ఉన్నతంగా ఎదగాలని అభిలాషించారు. విద్యారులు ఉన్నత లక్ష్యాలను చేరుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు.

ఈ కార్యక్రమంలో పన్నాటి మల్లేశం, కట్కూరి రాజేశం, బాలే శ్రీనివాస్, గడ్డం ప్రభాకర్, త్రినాథ్, సంజీవ్ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

మల్యాల, మే 5: నూకపల్లి డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద గుడిసెలో నివాసముంటున్న చందుర్తి మండలం రాజరాంపల్లెకు చెందిన కుక్కల సత్తవ్వ అనే మహిళ ఆదివారం మృతి చెందగా నూకపల్లికి చెందిన మాజీ సైనికుడు శ్రీనివాస్ అంత్యక్రియలు జరిపించారు. పది ఏళ్లుగా ఇక్కడే ఉంటున్న సత్తవ్వ అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియలు చేశారు. ఈ సందర్భంగా పలువురు శ్రీనివాస్‌ను అభినందించారు.

బీఆర్ఎస్ రోడ్‌షోకు తరలిన నాయకులు



రోడ్‌షోకు బయల్దేరి వెళ్తున్న కార్యకర్తలు

మెట్‌పల్లి, మే 5: బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించే రోడుషోకు బారీ ఎత్తున నాయకులు తరలివెళ్లారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేలు, నాయకులతో నిర్వహించే రోడ్‌షోకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పిలుపు మేరకు పట్టణంలోని 23వ వార్డు కౌన్సిలర్ ఓజ్జెల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో నాయకులు బయలు దేరారు. బీఆర్ఎస్‌పై నియోజకవర్గ అధ్యక్షుడు ఓజ్జెల శ్రీనివాస్, లీడర్ సలీం, చరణ్, గంగాధర్, బాలకంఠం, విజయ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : జిల్లా కేంద్రంలో నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నిర్వహించిన రోడుషోకు మండలంలోని నాయకులు బయలు దేరివెళ్లారు. ఆదివారం బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి గడ్డం రాజారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో నాయకులు వేళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గోవర్ధన్ భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు.

రాయికల్: జగిత్యాలలో జరిగే కేసీఆర్ రోడ్ షోకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. రోడ్‌షోను విజయవంతం చేయాలని వారు కోరారు.

కొడిమ్యాల : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించు రోడ్డు షోకు వేలాది మంది కార్యకర్తలు తరలి వెళ్లారు. మండలంలోని వివిద గ్రామాల నుండి వాహనాలపై తరలి వెల్లారు.

దేవుడి పేరుతో బీజేపీ రాజకీయాలు

● ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



దుంపెటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, మే 5 : భారతీయ జనతా పార్టీ మతం, దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుతున్నాయని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. మండలంలోని పోసానిపేట, దుంపెట, దూలూరు, తక్కళ్లపల్లి గ్రామాల్లో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్నర్ సమావేశాల్లో మాట్లాడారు. గతంలో గెలిచిన వ్యక్తులు మన ప్రాంతానికి ఎప్పుడైనా వచ్చారా, అభివృద్ధి కోసం నిధులు తెచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని పాలించి గడిచిన పదేళ్లలో ఎలాంటి అభివృద్ధి సాధించని బీఆర్ఎస్‌కు పట్టిన గతి దేశంలో బీజేపీకి పట్టడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కుల గణన చేసి ఆ ఫలితాలు అందరికి అందేలా చూసే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేసి తీరుతామని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడ విడ్డూరమన్నారు. పోసానిపేట మాజీ సర్పంచ్ ఎంజీ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, చెదలు సత్యనారాయణ, ఎన్నారై బైర దేవ్, కల్లెడ గంగాధర్, పులి హరిప్రసాద్, సంతోష్, చౌదరి, లింగంగౌడ్, ఎగ్యారపు శ్రీహరి ఉన్నారు.

కేసీఆర్ చేసిన మోసాలను గుర్తు చేసుకోవాలి

- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



వాకర్స్‌తో కలిసి నడుస్తూ ప్రచారం చేస్తున్న సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 5: కేసీఆర్ చేసిన పాపాలు, మోసాలను ప్రజలు గుర్తు చేసుకోవాలని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో వాకర్స్‌ను ఆయన కలిసి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ మళ్లీ డ్రామాలాడుతూ ఓట్లు దండుకోవడానికి మీ ముందుకు వస్తున్నాడన్నారు. సోషల్‌మీడియా ద్వారా చేయిస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లించేందుకు, ఢిల్లీకి కప్పం కట్టేందుకు డబ్బులిస్తున్న కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు డబ్బుల్లేవనడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ నమ్మించి గొంతుకోసే రకమని అన్నారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, అన్ని వర్గాలను రాచిరంపాన పెట్టిన సంఘటనలు, ప్రశ్నించే గొంతులను నులిమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. మోదీ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలతోపాటు అభివృదికి చేసిన కృషిని వివరించారు. రైతులు పంట నష్టపోతే పరిహారం ఇవ్వని దుర్మార్గుడు కేసీఆర్ అన్నారు. వరి కుప్పలపై గుండె పగిలి చనిపోతే స్పందించలేదన్నారు. ఇక్కడి రైతులను ఆదుకోకుండా పంజాబ్‌కు పోయి అక్కడి రైతులకు పైసలిచ్చి ప్రచారం చేసుకున్నాడన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజితో 30 లక్షల నిరుద్యోగుల బతుకులను ఆగం చేసి రోడ్డు పడేసిండన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో నానా గోస పెట్టి భార్యభర్తలు ఫోన్‌లో మాట్లాడుకోలేని పరిస్థితికి తీసుకువచ్చిండన్నారు. ఫోన్ ట్యాపింగ్ ప్రధాన నిందితుడు పంపే సొమ్ముతో కరీంనగర్‌లో కార్పొరేటర్లను, ప్రజా ప్రతినిధులను కొనుగోలు చేస్తున్నారన్నారు. ఫోన్‌ట్యాపింగ్ నిందితుడు వియ్యంకుడితో కలిసి ఓ వ్యాపార వేత్త, మాజీ ప్రజా ప్రతినిధి కార్పొరేటర్లను కొంటున్నాడని ఆరోపించారు. కబ్జాలు చేసిన వాళ్ల మాదిరిగా ఫోన్ ట్యాపింగ్ నిందితులంతా అరెస్ట్ కావడం తథ్యమన్నారు.

కరీంనగర్ అభివృద్ధికి తపనతో పని చేస్తా..

- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు



కాలనీవాసులతో కలిసి అల్పాహారం చేస్తున్న రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, మే 5: కరీంనగర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు తపనతో పని చేస్తానని, తన తండ్రి వెలిచాల జగపతిరావు ఆశయాలను ముందుకు తీసుకెళతానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. ఆదివారం నగరంలోని ఏడో డివిజన్ హౌసింగ్ బోర్డ్ కాలనీ లైబ్రరీలో స్థానికులతో రాజేందర్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి కరీంనగర్ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. పనిచేయాలనే తపనతో పాటు కనీస పరిజ్ఞానం, విజ్ఞానం ఉండాలని, చదువు సంధ్యాలేని బండి సంజయ్ లాంటివారికి ఓటేస్తే అభివృద్ధి సాధ్యం కాదన్నారు. బీజేపీ నేతలు అయోధ్యలో దేవుడి ప్రతిష్ఠ జరకముందే పసుపు బియ్యం పంపించి, వాటిని అక్షింతలు అని నమ్మించి ప్రజల మనోభావాలను దెబ్బ తీశారని విమర్శించారు. జీఎస్టీని 16 శాతానికి పెంచి నిత్యవసరాల ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. రాక్షస పాలన కొనసాగిస్తూ రాముడి బొమ్మ పెట్టుకోవడం ఏంటని, ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని హనుమాన్ టెంపుల్, శివాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పిస్తానని ఈ సందర్భంగా స్థానికులకు హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ లో 14 వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి నగరానికి నీటి సమస్య తీర్చిన ఘనత జగపతిరావుకి దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో కలిసి రాజేంద్రరావు అల్పాహారం చేశారు. కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఏఎస్ఐ శ్రీనివాస్‌కు అవార్డు

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలకు చెందిన స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్ ఢిల్లీకి చెందిన శిఖరం ఆర్ట్ థియేటర్స్ నంది అవార్డును అందుకున్నారు. ఆదివారం న్యూఢిల్లీలోని లోక్ కళామంచ్ వేదికపై జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీనియర్ ఐఆర్ఎస్ అధికారి, న్యూ ఢిల్లీ కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎస్కే రహమన్ చేతుల మీదుగా శ్రీ క్రోధి ఉగాది జాతీయ నంది అవార్డును స్వీకరించారు. అయిదేళ్లుగా వాట్సప్ గ్రూప్‌ల ద్వారా సుమారు 334 ఆర్యవైశ్య వధూవరులకు ఉచితంగా వివాహాలను కుదిర్చినందుకు గాను, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసిన సందర్భాలను పురస్కరించుకొని అవార్డుకు ఎంపిక చేసింది.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కథలాపూర్, మే 5: మండలంలోని భూషణరావుపేటలో ఆదివారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. స్థానికులు 12వ వార్షికోత్సవంలో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. అర్చకులు నిర్వహించిన కార్యక్రమాన్ని భక్తులు కనులారా వీక్షించారు. పుర వీధుల వెంట స్వామివారిని ఊరేగించారు.

కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతాం

మల్యాల, మే 5: లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కెటాయించని కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌మాదిగ అన్నారు. మల్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ అంకితభావంతో ఉన్నారని తమ జాతి మొత్తం బీజేపీకి అండగా నిలుస్తుందని తెలిపారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ గెలిపిస్తామని తెలిపారు. దుమాల గంగారాం, గాజుల మల్లేశం, గుండేటి గంగారాం, సురుగు శ్రీని వాస్, చిలుముల రాజయ్య, గంగాధర రవి, సతీష్, కిషన్ పాల్గొన్నారు.

నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

వెల్గటూర్, మే 5: వెల్గటూర్ బస్టాండ్ సమీపంలో శనివారం జరిగిన గొడవను దృష్టిలో ఉంచుకొని నలుగురు వ్యక్తులు కప్పారావుపేటకు చెందిన గాజుల రాజేందర్‌పై దాడి చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. గాజుల రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైరం అజయ్య, చింతకింది తరుణ్, బైరం సిద్ధు, గంగుల అభిలాష్‌లపై హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.